క్లుప్తంగా

నేడు హోం మంత్రి పర్యటన ఇలా..

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత గురువారం ఉదయం 8 గంటలకు చాగల్లు సచివాలయం–2 పరిధిలో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు తాళ్లపూడి మండలం ప్రక్కిలంకలో రావిపాటి ఫంక్షన్ హాల్లో నిర్వహించే వై ఏపీ నీడ్స్ జగన్ అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి చాగల్లులో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంతి వనిత పాల్గొంటారు.

తిమ్మరాజుపాలెంలో భారీ అన్న సమారాధన

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్రుల ముగియడంతో మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద బుధవారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఎమ్మెల్యే స్వయంగా వడ్డించి అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో..

చాగల్లు: దసరా ఉత్సవాలు ముగియడంతో బ్రాహ్మణగూడెం రావుల చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. గరప్పాడు, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెం గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

రోటరీ ఆధ్వర్యంలో వన మహోత్సవం

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ఆలయాల వద్ద బుధవారం పూజకు అవసరమైన వివిధ రకాల పూల మొక్కలను నాటారు. ఇందుకు చెన్నా శ్రీనివాస్, నాగమణి దంపతులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రోటరీ ఉప డిస్ట్రిక్ గవర్నర్ పోలదాసు శ్రీనివాస్, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ల రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి నాగేశ్వరరావు, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల గౌరవ వేతనాలు ట్రెజరీకి జమ

కొవ్వూరు: పంచాయతీ సర్పంచుల గౌరవ వేతనం సొమ్ము సబ్ ట్రెజరీల్లో పంచాయతీ ఖాతాల్లోకి జమ అయినట్టు జిల్లా పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ ఒక్కో నెలకు రూ.3 వేల చొప్పున తొమ్మిది నెలలకు గాను రూ.27 వేల చొప్పున జిల్లాకు రూ.75.33 లక్షలు జమ అయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 300 పంచాయతీలు ఉండగా వాటిలో వివిధ కారణాల రీత్యా 21 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. 279 మంది సర్పంచులకు ఒక్కొక్కరికి రూ.27 వేల చొప్పున డిసెంబర్ నెలాఖరు వరకు నిధులు విడుదలైనట్టు డీపీవో వివరించారు.

గ్రాంట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టండి

- జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య
- ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య

ఉండ్రాజవరం: వివిధ గ్రాంటుల కింద ప్రభుత్వం పంచాయతీలకు మంజూరు చేసిన నిధులను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య సూచించారు. ఉండ్రాజవరం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో భాస్కరరామయ్య మాట్లాడుతూ పంచాయతీలకు కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టకపోతే వాటిని అభివృద్ధికి ముందుకు వచ్చే పంచాయతీలకు కేటాయిస్తామన్నారు. తహసీల్దార్ జి.కనకరాజు మాట్లాడుతూ మిల్లులకు ధాన్యం తీసుకువెళ్ళే ప్రతి వాహనానికి జీపీఎస్ చేయించుకోవాలన్నారు. విద్యుత్ ఏఈ దొరబాబు మాట్లాడుతూ వ్యవసాయానికి, గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి సమావేశానికీ ఆర్ అండ్ బీ ఏఈ హాజరు కాకపోవడాన్ని సభ్యులు ఎంపీడీవో జీఆర్‌కే రాజు దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి హాజరైన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నరహరిశెట్టి సరోజ, చెట్టే నవీన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాత కలవరం

- పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం
- కొన్నిచోట్ల చిరు జల్లులు, ఈదురు గాలులు

కొవ్వూరు: అకాల వర్షం అన్నదాతను కలవరపెడుతోంది. వారం, పది రోజులుగా ఖరీఫ్ వరి కోతలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి అందే సమయంలో వర్షం కురిస్తే తమ కష్టమంతా గంగ పాలవుతుందనే భయం వారిని వెంటాడుతోంది. గత వారం బంగాళాఖాతంలో హమూన్ తుపాన్ ఏర్పడినప్పటికీ ఆ తుపాన్ బంగ్లాదేశ్ వైపు మళ్లడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం కొవ్వూరు, దేవరపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో జల్లులు పడ్డాయి. వర్షానికి తోడు ఈదురు గాలులు కూడా వీయడంతో పలు చోట్ల కోతకు సిద్ధమవుతున్న వరిపైరు నేల వాలింది.

ఇదీ పరిస్థితి

ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంట పాలు పోసుకునే దశలో ఉంది. మరికొన్ని చోట్ల గింజ గట్టిపడే దశలో ఉంది. పాలు పోసుకునే దశలో వర్షం కురిస్తే తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. తద్వారా దిగుబడిపై ప్రభావం పడుతుంది. కోత దశలో ఉన్న పంట ఈదురు గాలులకు నేల వాలితే గింజ మెలకెత్తే అవకాశం ఉంటుంది. పంట నేల వాలితే గింజలు రాలిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుంది. పైగా వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దాంతో రైతులు కలత చెందుతున్నారు. అత్యధికంగా నలభై శాతం ఆయకట్టులో స్వర్ణ రకం వరి వంగడాన్ని సాగు చేశారు. పీఎల్ఏ–1100 30 శాతం ఆయకట్టులో సాగు చేయగా, బీపీటీ –5204 రకం 2,800 హెక్టార్లలోను,



నూర్పిడి చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తదితరులు

పీఎన్– 126 (పీఆర్) రకం రెండు వేల హెక్టార్లలోను సంపత్ స్వర్ణ–1064, ఎంటీయూ –1061, ఎంటీయూ–1121, ఎంటీయూ–1156, ఎస్ఐ– 10, ఎంటీయూ–1010 వంటి రకాలు మిగిలిన ఆయకట్టులో సాగు చేశారు.

నెమ్మదిగా వరి కోతలు

ఖరీఫ్ వరి కోతలు నెమ్మదిగా సాగుతున్నాయి. మండలాల వారీగా కొవ్వూరులో 8.5 శాతం, నల్లజర్లలో 4.5, చాగల్లులో 4.9 శాతం ఆయకట్టులో వరి కోతలు కోశారు. పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో కోతలు మొదలైనప్పటికీ, ప్రస్తుతానికి ఒక శాతం లోపు ఆయకట్టులో మాత్రమే. కాగా ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుభరోసా కేంద్రాల్లో ప్రారంభించింది. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటికే కొవ్వూరు, చాగల్లు, నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో 200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వాటిలో పీఎన్–126 రకం, ఆర్‌పీ బయో అనే నూజివీడు, బీపీటీ– 5204 (సాంబ మసూరి)వంటి ఏ గ్రేడ్ ఫైన్ ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బస్తాకు గరిష్టంగా రూ.17,00 వరకూ రేటు లభిస్తోంది. రైతులు ఈ రకం ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. సాంబ మసూరి రకం ధాన్యాన్ని ఇంట్లో ఆహారం నిమిత్తం వినియోగిస్తున్నారు. ఎంటీయూ –7029, సంపత్ స్వర్ణ రకాలను మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు.

బోదెలు ఏర్పాటు చేసుకోండి



వర్షపు నీరు బయటి వెళ్లేందుకు అనువుగా లోతట్టు ప్రాంతాల రైతులు పంట పొలంలో బోదెలు చేసుకోవాలి. కోతకు వచ్చి నేలపై వాలిన పంటపై ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. దీనివల్ల ధాన్యం తడిసినప్పటికీ మెలక రాదు. ఇప్పటి వరకూ కోతలు పూర్తయిన పంటలో అత్యధికం శాతం ఏ గ్రేడ్ ఫైన్ రకాలే. వాటికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

–ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

ధాన్యం తడవకుండా రైతన్నల పాట్లు

దేవరపల్లి: దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్ర వరకూ అకాల వర్షం కురిసింది. వర్షానికి రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాసులు తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం రాసులపై రైతులు బరకాలు కప్పి ఒబ్బిడి చేశారు. మండలంలోని గౌరీపట్నం, దుద్దుకూరు, యర్నగూడెం గ్రామాల్లో హైవే రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టారు. అయితే ఈ అకాల వర్షం పొగాకు, మినుము, మిరప వంటి తోటలకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో వర్షానికి తడిసిన ధాన్యపు రాసులపై బరకాలు కప్పి ఒబ్బిడి చేసిన రైతులు

మద్దతు ధరకే ఖరీఫ్ ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సింగవరంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిడదవోలు రూరల్: రైతులందరూ ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే విక్రయించాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు సూచించారు. మండలంలోని సింగవరం రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గోనెసంచుల కొరత లేకుండా 5 లక్షల సంచులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఆపరేటర్‌తో పాటు హెల్పర్‌ను నియమించామని చెప్పారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుచేసి ఏడు రోజుల్లో ధాన్యం రవాణా ఖర్చులు నేరుగా జమ చేస్తామన్నారు. ధాన్యంలో తేమ శాతంలో ఎలాంటి మోసాలు జరిగిన, ధాన్యం కొనుగోలులో రైతుల



కొనుగోలు కేంద్రంలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నుంచి డబ్బులు డిమాండ్ చేసినా మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు, ఉప సర్పంచ్ రామరాజు, ఏవో జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా పథకాలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కె.సావరంలో గడప గడపకూ..

ఉండ్రాజవరం: కులం,మతం, పార్టీ అనే భేదం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కె.సావరం గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, అక్కచెల్లెమ్మలతో మాట్లాడారు. అవ్వా పింఛను వస్తోందా? తాతా ఎలా ఉన్నావ్? అంటూ ఆప్యాయంగా పలకరించారు. పథకాల మంజూరుకు అర్హులై ఉంటే చాలని, వలంటీర్ల ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడమే కాకుండా వారి అవసరాలను గుర్తించడమే లక్ష్యంగా గడప గడపకూ తిరుగుతున్నట్టు చెప్పారు.



కె.సావరంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లోనే ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ మండలంలో సుమారు 6,000 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బస్వా రామన్నరావు, బస్వా శ్రీనివాసు, వగ్రే బాబీ, మీసాల సురేష్, బస్వా జగన్, రాపాక రమాదేవి పాల్గొన్నారు.

పట్టణంలో చెత్త ఐ.పంగిడిలో డంపింగ్‌పై రగడ

కొవ్వూరు: పట్టణ పరిధిలో సేకరించిన చెత్తను ఐ.పంగిడి సమీపంలోని జెడ్పీ స్థలంలో పారబోయడాన్ని ఆ గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. మునిసిపల్ చెత్త తరలించే వాహనాలు బుధవారం ఉదయాన్నే ఐ.పంగిడిలో చెత్తను డంపింగ్ చేసి తిరిగి వస్తున్నాయి. సమాచారం అందుకున్న ఆ గ్రామ నాయకులు డంపింగ్ యార్డు వద్దకి చేరుకున్నారు. కొవ్వూరులో సేకరించిన వ్యర్థాలను తమ గ్రామంలో పారబోయ వద్దని ఐ.పంగిడి వాసులు కొంత కాలంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారుల తీరుపై గ్రామ నాయకులు మండిపడ్డారు. ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు (నానాజీ), టీడీపీ నాయకుడు పొట్రు సిద్ధూ, జనసేన నాయకుడు చొటుపల్లి శివతో పాటు పలువురు గ్రామస్తులు పార్టీలకు అతీతంగా హాజరై మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌ను నిలదీశారు. తీవ్ర తర్జనభర్జనల అనంతరం డంపింగ్ చేయడాన్ని నిలుపుదల చేసేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రజలను తెలియజేస్తామని నాయకులు ప్రకటించారు. రూరల్ సీఐ వైవీ రమణ, ఎస్సైలు జి.సతీష్, కేవీ రమణ,డి.భూషణం తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఐ.పంగిడి నాయకులు, గ్రామస్తులు

ఈ నెల 30న యుద్ధభేరి మహాసభ

- ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు
- కొవ్వూరులో పోస్టర్ ఆవిష్కరణ

కొవ్వూరు: నవంబర్ 30న మాదిగ, రెల్లి, డక్కలి ఉప కులాల యుద్ధభేరి మహాసభను విజయవాడలోని జింఖానా మైదానంలో నిర్వహించనున్నట్టు ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు ప్రకటించారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మేమెంత మందో అంత వాటా' నినాదంలో ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఈ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 28 ఏళ్ల మాదిగల సుదీర్ఘ పోరాటాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్నారు. సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై ప్రభుత్వాలు తమ వైఖరిని వెల్లడిస్తూ తీర్మానాలు చేయాలన్నారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహం పక్కనే బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కొడవటి బుజ్జిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రాజు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చెట్టే సుజనరావు, రాష్ట్ర కార్యదర్శి కొడమంచిలి రమణ, ఉభయ గోదావరి జిల్లా కన్వీనర్ గెల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బల్లంకుల రాజు,పట్టణ శాఖ అధ్యక్షుడు కొడవటి దేవా పాల్గొన్నారు.

పెద్దేవంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం మెయిన్ రోడ్డు నుంచి ఆ పంచాయతీ పరిధిలోని పదో వార్డు వరకూ రెండు కిలోమీటర్ల పొడవైన బీటీ రోడ్డుకు బుధవారం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామకృష్ణ శంకుస్థాపన చేశారు.రూ.41 లక్షల వ్యయంతో ఈ పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులను కూడా వెంటనే మొదలు పెట్టారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే పెద్దేవం గ్రామ శివారు 10వ వార్డులో ఆకుకూరలు పండించే రైతులు, చిరు వ్యాపారుల ఇబ్బందులు తొలగుతాయని సర్పంచ్ సర్పంచ్ వెంకటరావు తెలిపారు. హోం మంత్రి తానేటి వనిత చొరవతో ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సురక్షలో 489 మందికి వైద్యం

నిడదవోలు రూరల్: మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు బుధవారం ప్రారంభించారు. వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సృజన పర్యవేక్షణలో పలువురు వైద్య నిపుణులు 489 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఉప సర్పంచ్ గంధం చంటిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సింగులూరి వెంకటేశ్వరరావు, నాయకులు వీరమళ్ల త్రిమూర్తులు, వారా ఉమ, బట్టు సురేష్, వారా మణెమ్మ, ఎంపీడీఓ పి.శామ్యూల్, కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

350 లీటర్ల సారా స్వాధీనం

- 2,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం
- ఇద్దరి నిందితుల అరెస్టు



తాడిపూడి కాలువ వద్ద పట్టుబడిన సారా, తయారీ సామగ్రి, ఇద్దరు నిందితులతో కొవ్వూరు డీఎస్పీ వర్మ, ఎస్సైలు, పోలీసులు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట రెవెన్యూ పరిధిలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ వద్ద నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్‌ వర్మ సారథ్యంలో నిర్వహించిన ఈ దాడిలో 350 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 2,200 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే నాలుగు గ్యాస్ స్టౌవ్‌లు, గ్యాస్ సిలిండర్లు, ఆరు అల్యూమినియం పాత్రలు, 11 ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి పాల్పడుతున్న భీమోలుకు చెందిన బెజవాడ రవీంద్ర, గోపిరెడ్డి పోశియ్య అనే ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ దాడిలో తాళ్లపూడి, గోపాలపురం ఎస్సైలు కె. వెంకటరమణ, కె.సతీష్, వారి సిబ్బంది పాల్గొన్నారు. సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

10 లీటర్ల సారాతో తయారీదారు అరెస్టు

అలాగే రాగోలపల్లి గ్రామ సమీపంలోని కొవ్వాడ కాలువ వద్ద సారా తయారు చేస్తున్న తుపాకులగూడేనికి చెందిన బలం రామకోటి అనే వ్యక్తిని తాళ్లపూడి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే అల్యూమినియం పాత్రలను, ప్లాస్టిక్ డ్రమ్ములను వారు ధ్వంసం చేశారు. నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్టు తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు.

అమరజీవి త్యాగాన్ని మరువలేం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం
- పొట్టి శ్రీరాములుకు నివాళి

నిడదవోలు: రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేమని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్లో పట్టణ ఆర్యవైశ్య సంఘం, నిడదవోలు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఏటా నవంబర్ 01న అవతరణ వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పచ్చిపులుసు వీరభద్రరావు, కార్యదర్శి కారుమూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి కొణిజేటి వెంకటనారాయణ, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, చిలకల శారదాదేవి, ఆలమూరి భారతి, ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు పాల్గొన్నారు.

కొవ్వూరు: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ మెయిన్ రోడ్డులోని, ఆర్య వైశ్య కల్యాణ మండపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు,నాళం శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగ రమేష్, మద్దుల వీర వెంకట సత్యనారాయణ, కొత్తమాసు వాసుదేవరావు, వలివేటి ప్రసాద్, వంకాయాల శివరామకృష్ణ, కోట్ల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నల్లజర్ల: రాష్ట్రావతరణ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఈఓపీఆర్డీ సింహాద్రి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అజయ్‌బాబు, పీఆర్ ఏఈ వినోద్‌కుమార్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు కిశోర్‌కుమార్ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రావతరణ వేడుకల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పాల్గొన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళి అర్పించారు. అలాగే ముక్కామల, కానూరు, ఖండవల్లి గ్రామాల్లో రాష్ట్రావతరణ దినోత్సవాన్ని నిర్వహించారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక పెద్దగూడెం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం కె. పోశియ్య, సిబ్బంది పొట్టి శ్రీరాములు చి త్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు ఎస్. రాజశేఖర్, జగతా శ్రీనివాస్, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రావతరణ వేడుకల్లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, మండల కమిటీ ఉపాధ్యక్షుడు కామిశెట్టి దుర్గారావు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్య వైశ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీఘాకోళపు కాళీకృష్ణ, తీగెల బలరామయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చాగల్లు: స్థానిక కోరంగి వారి సెంటర్లోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా ఉప సర్పంచ్ మేకా రాజు హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గ్రంధి రాంబాబు, శ్రీకాకుళం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



పెరవలి మండల పరిషత్ ఆఫీసులో పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు



దేవరపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ దుర్గారావు తదితరులు

వ్యాపారి కిడ్నాప్ కేసులో ఇద్దరిపై కేసు

నిడదవోలు రూరల్: ఓ వ్యాపారిని నిర్బంధించి, దాడి చేసిన కేసులో ఇద్దరిపై సమిశ్రగూడెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై షేక్ సుభానీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన పువ్వల వెంకట గొల్లాకృష్ణ అదే పట్టణంలో డ్రైఫ్రూట్స్ వ్యాపారం చేస్తున్నారు. నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన రాచపోతు శ్రీనివాస్‌తో అతడికి వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. వారిద్దరి మధ్య సాగిన ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో అక్టోబర్ 30న గొల్లా కృష్ణను తాడేపల్లిగూడెంలో కిడ్నాప్ చేసి కారులో ఎక్కించుకుని తాడిమళ్లలోని జీడిపప్పు ఫ్యాక్టరీకి తీసుకు వచ్చి బంధించారు. ఈ క్రమంలో తనను నిర్బంధించిన శ్రీనివాస్‌తో పాటు అతని వద్ద పనిచేసే గారపాటి ఫణీ దుర్గా మధుకిరణ్ కలిసి తనపై దాడిచేసి హత్యాయత్నానికి ప్రయత్నించారని బాధితుడు గొల్లా కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభానీ పేర్కొన్నారు.